# చండామార్కుడి స్వీయకథ

నేనొక హైస్కూలు టీచర్ని. నాపేరు వీరభద్రం. పేరుకు తగ్గట్టు నేను కాస్త కచ్చితమైన మనిషిని. మరేం లేదు. పిల్లలు ఒళ్లువంచి పాఠాలు చదువుకోవాలని, అయ్యవార్లు ఒళ్లు దాచుకోకుండా చదువు చెప్పాలనీ నా అభిప్రాయం. అప్పటికి తామేమిటో లోకాలన్ని ఉద్ధరించడం కోసం పంతులుగిరీ చేబట్టినట్టు భావించే ఉపాధ్యాయులంటే నా కెలాగైతేనచ్చదో వరహీనపు పెళ్లికొడుకులను చూచినట్టుగా ఉపాధ్యాయుల్ని చిన్నచూపు చూచే వాళ్లన్నా గిట్టదు. సమాజం పట్ల నాబాధ్యతను నేను ఉపాధ్యాయునిగా నిర్వహిస్తున్నాను. ఈ కర్తవ్యాన్ని నిర్వహించడంలో లౌకిక శక్తుల్లో దేనికీ భయపడవలసిన అవసరం లేదని నా నమ్మకం. ఇది వట్టి దురభిప్రాయమనీ, దీనివల్ల ఎప్పుడయినా నా పుట్టి మునిగిపోతుందని శ్రేయోభిలాషులు కొందరు చెబుతూ వచ్చారు. కానీ వాళ్ళ మాటల్ని నేను చెవిలో వేసుకోలేదు. నా చిన్నతనంలో మా నాన్నగారు నాకొక విషయం చెబుతుండేవారు. యమధర్మరాజు సింహాసనం ఒక వెంట్రుక ఆధారంగా అంతర్మధ్యంలో వ్రేలాడుతూ ఉంటుందట. ఆ సింహాసనం క్రింద దారుణంగా మంటలు నాలికలు చాస్తూ ఒక అగ్నిగుండం వుంటుందట! కర్తవ్యాన్ని నిర్వహించడంలో కాస్తంతపొరపాటు జరిగితే వెంట్రుక తెగిపోయి సింహాసనం యముడితోసహా అగ్గిలో పడిపోతుందట. పనిగట్టుకొని నేను వాకబుచేసి చూశాను. యమధర్మరాజు అగ్నిగుండంలోపడి భస్మమై పోయాడని ఒక పౌరాణికుడయినా చెప్పలేదు. కానీ ఈ దృష్టాంతాన్ని నా ద్వారా విన్న పెద్దమనుషులు కొందరు ముఖంచాటు చేసుకొని నవ్వుకోడం నేను గమనించాను. నవ్వుకుంటే నవ్వుకోనీ! "నవ్వుకొందురుగాక నాకేటి సిగ్గు" అన్నాడు కవి. "నా యిచ్ఛయే గాక నా కేటి వెరపు" అనిగూడా అన్నాడు. ఉపాధ్యాయుణ్ణిగా పనిచేస్తున్నందుకు గవర్మెంటు నా కెంతోకొంత ప్రతి ఫలం ముట్టజెపుతోంది. నా పెళ్ళాం బిడ్డలూ నేనూ ఆ జీతంరాళ్ళ పైన ఆధారపడి బ్రతుకున్నాము. పరిస్థితి యిదయివుండగా నా కొకరి మెహర్బాన్ కావలసిన అవసరం

ఏముంది? అందువల్ల ఆన్సర్ పేపరు చేతికి తీసుకున్నప్పుడు నేను అది ఏ కుర్రవాడిదై ఉంటుందో ఆలోచించను. అందులోని విషయాన్ని మాత్రమే గమనిస్తాను. ఒక పళ్ళెంలో కుర్రవాడి జవాబు. ఒక పళ్లెంలో నేనిచ్చే మార్కుమధ్యలో ముల్లు సూటిగా తొంభై డిగ్రీలలో ఆకాశంవైపు చూస్తుంటేగానీ నేను వొప్పుకోను. దీన్ని సుగుణంగా భావించి లోకం నన్నొక ఆదర్శ ఉపాధ్యాయుణ్ణిగా భావించి వుంటుందనే నా అనుమానం. కాకపోతే అది నన్నెందుకు ఊళ్లు తిప్పుతుంది? నా గొప్పతనం ఒక ఊరికి. ఒక ప్రాంతానికి పరిమితమై పోకుండా వుండడం కోసమే బహుశ యిలా జరిగి ఉంటుంది. ఇలా జరిగినందుకు నన్ను చూచి అయ్యోపాపం అంటూ జాలిపడ్డవాళ్లపైన నేను కోపగించుకునేవాణ్ణి అప్పటికి నానా రాజ సందర్శనం గొప్పదయిపోయి నానా ప్రాంత సందర్శనం తక్కువయి పోయిందా? పిల్లిని క్షుద్రప్రాణి అనుకుంటాం. అలాంటి పిల్లి తన కూనల్ని నోట కరచుకొని ఏడిండ్లు తిరుగుతుండగా మానవుణ్ణిగా పుట్టి నేనొకచోట వుండి పోవడం ఏం న్యాయం! అందువల్ల ఎప్పుడంటే అప్పుడు నా జెండా లేవదీసి భుజాన పెట్టుకొని, భార్యను బిడ్డలను వెంటబెట్టుకుని ఇంకొకచోటికి వెళ్లిపోవడానికి నేను సర్వధా సంసిద్ధంగా ఉండేవాణ్ణి! పనిలోపనిగా లోకం నా పట్లచూపిన అపారమైన దయా విశేషాన్ని గురించి ఇంకొకమాట గూడా చెప్పుకోవాలి. అది నాకొక గొప్ప బిరుదాన్ని గూడా ప్రసాదించింది. ఒకనాటి సుప్రభాత సమయాన నేనింకా పడకపైన పడుకొని వుండగానే, పేడనీళ్లు చల్లడంకోసం వీధిలోకి వెళ్లిన మా ఆవిడ పరుగు పరుగునా లోపలికివచ్చి నాకా శుభవార్త తెలియజేసింది. వెళ్లిచూదునుగదా వీధిగోడమీద తాటికాయ సైజులో నల్లటి అక్షరాలు కనిపించాయి కూడి కూడి చదవడంతో చదువు ముగించుకున్న మా ఆవిడ ఆ అక్షరాలపైన కుస్తీపడుతోంది. "ఛ...ఛ...ఛథా...అంటూ వెనుక్కూ ముందుకూ గిరికీలు కొడుతున్న ఆమె చదువరితనాన్ని చడా మడా నాలుగు తిట్టి "ఓసి వెర్రి మొగమా! ఇది చండామార్కుడే!" అన్నాను. "చండామార్కు డెవడండీ బాబూ! వాడెందుకొచ్చాడండి మన గోడపైకి?" అంటూ ఆవిడ రాగం తీసింది "వాడెవడో అయితే మనయింటి గోడపైకెందుకొస్తాడే మొద్దూ! వాడే వీడు వీడేవాడు అన్నట్టుగా ఆ చండామార్కుణ్ణి నేనే" అన్నాను. "ఏడ్చినట్టే వుందిలెండి! ఉండం డుండండి. చీపురు తెచ్చి చెరిపి పారేస్తాను." అంటూ ఆవిడ యింట్లోకి తుర్రుమంది. అన్నంత పనీ చేస్తుందేమోనని వెనువెంటనే లోపలికి వెళ్లి ఆవిడకు అడ్డుతగిలాను. "చూడు వసంతా! నలుగురు బిడ్డల తల్లివైతే అయ్యావుగానీ నీకు లోకమంటే బొత్తిగా ఖాతరు లేకుండా పోయింది. లేకపోతే లోకం నాకిచ్చిన ఈ గొప్ప బిరుదాన్నింత చులకనచేసి పారేసేదానివిగావు. కందుకూరి వీరేశలింగంగారి యింటిగోడపైన "ముండమోపులకు

పెళ్లిచేసే వీరేశలింగం" అని వ్రాసిపెట్టినప్పుడు ఆయనేమన్నారో నీకు తెలియదా? తెలిసి వుండదు. తనకు కావలసిన బిరుదం అదేనన్నారు. అంతటి మహానుభావుడికే బిరుదాలపట్ల అంత మోజుంటే, యింక మనకుండడంలో తప్పులేదు. ఉండిపోనీ. నువ్వు దాని జోలికి వెళ్దొద్దు..." అంటూ వెయ్యి విధాలుగా బ్రతిమాలి నా బిరుదును నేను దక్కించుకున్నాను.

ఇదంతా గడిచిన కథ. ఇప్పుడు చెప్పొచ్చిం దేమిటంటే ఈ సంవత్సరం వేసవి సెలవుల తర్వాత బడి తెరచిన కొత్తలో సాంఘికశాస్త్రం చెప్పడంకోసం నేనొక తరగతి గదిలో ప్రవేశించాను. తరగతిలో అన్నీ కొత్త ముఖాలే కనిపిస్తున్నాయి. నామాటకేంగానీ ఆ కుర్రాళ్లకు బడి కొత్తది. తరగతి కొత్తది. పాఠ్యపుస్తకాలు కొత్తవి. టీచరుగూడా కొత్తవాడే. ఈ కొత్త ప్రపంచంలో విద్యాధనం రాశిగా పోసిఉంటుందనీ, దాన్ని తలా కొంచెం దోచుకపోవచ్చుననీ వచ్చినట్టున్నారు.కుర్రకుంకలు. లేత బుగ్గలతో, చిలిపికళ్లతో, చిన్నచిన్న తలకాయలతో చూడ ముద్దొస్తున్నారు గూడా! ఒక వూపులో పాఠంలోకి దిగి పసివాళ్ళను బెదరగొట్టడానికి మనస్కరించక మెల్లమెల్లగా ప్రశ్నలతోనే ప్రారంభించాను. అమ్మో! ఏమీ తెలియనివాళ్ళల్లా కనిపిస్తున్నా రంతేగానీ వీళ్ళల్లో కొందరు అచ్చం సిసింద్రీలే! మన దేశం పేరు భారతదేశమేనన్నారు. ఈ దేశానికి ఉత్తరాన పర్వతాలేగానీ సముద్రం లేదన్నారు. మనం మాట్లాడే భాష తెనుగేనన్నారు. రోడ్డుపైన ఎడమ వైపున్నే నడవాలన్నారు. ఇంకా యింకా చాలా అన్నారు. కానీ ఏమీ అనకుండా చదువుల నిష్ప్రయోజకత్వాన్ని గురించి దీర్ఘంగా ఆలోచిస్తున్న బాల మేధావిలా చివరి బెంచీలో కూర్చున్న ఓ కుర్రాణ్ణి నేను పట్టుకున్నాను. అబ్బాయ్! మన దేశానికి స్వాతంత్ర్యంవచ్చిందెప్పుడు అన్నాను. "మన దేశానికి స్వాతంత్ర్యమా సార్! జండా ఎగరేసి మిఠాయిలు పంచిపెట్టేరోజున్నేనండి!" అన్నాడు కుర్రాడు. "అదే, అది ఏ నెలలో ఏ తారీఖున వస్తుందో చెప్పగలవా?" అన్నాను. కుర్రవాడు అయోమయంగా నా వైపు చూడసాగాడు. "పోనీ ఈ రోజు తారీఖేమిటిబాబూ?" అన్నాను. తగుదునమ్మాఅని చదువుచెప్పడానికి వచ్చిన ఉపాధ్యాయుడికి తారీఖులు తెలియకపోవడమేమిటని చిరాకు పడిపోతున్నట్టుగా ఆ కుర్రవాడు "మా ఇంట్లో తేదీల కాలెండరుంది సార్! దాన్ని తీసుకొచ్చి మీ కిచ్చేస్తానుసార్" అంటూ నా సమస్యను యిట్టే పరిష్కరించి పారేశాడు. విద్యార్థి తరగతి గదిలోకి తీసుకరావడానికి వీల్లేని దాని గురించి ప్రశ్నించడం శ్రేయస్కరమనిపించి "మైసూరు అడవులు దేనికి ప్రసిద్ధి?" అన్నాను. గంధపుచెట్టనో, ఏనుగనో జవాబు రాబట్టాలని నా ఉద్దేశం. కానీ ఆ కుర్రవాడు నా అంచనాను తారుమారుచేస్తూ "నేను ఎప్పుడూ మైసూరు అడవులలోకి వెళ్ల లేదుసార్!" అన్నాడు. అని అంతటితో వూరుకున్నాడా? "మా మామిడితోట కవతల చిట్టడవిలో

కుందేళ్లు దండిగా ఉన్నాయిసార్! మా పాలేరుతో చెప్పి రెండు కుందేళ్ళు పట్టించుకు రమ్మంటారా సార్!" అన్నాడు. నాకు మతిపోయినంత పనిఅయింది. కోరని కోరికల్ని గూడా నెరవేర్చే చిన్నసైజు కల్పతరువులా కాన వస్తున్న ఆ కుర్రవాణ్ణి దగ్గరికి పిలిచి పుస్తకం చేతికిచ్చి ఒక పాఠం చదవమన్నాను. అతడు 'మ' అన్నాడు తరువాత 'గద' అన్నాడు, "మ...మగ...మగదసా" అన్నాడు. మగధ సామ్రాజ్యంలో ఆ పైన మాకు రావత్తు జకుయావత్తు వున్నాయి. కుర్రా డెవడో గానీ బొత్తిగా అహింసా పరాయణుడల్లే ఉన్నాడు. ఒత్తులని నేరుబెట్టి ఒక అక్షరం పైన యింకొక అక్షరాన్ని రుద్దిబాధించడం అతడి కేమాత్రంనచ్చి నట్లులేదు. తెనుగు లిపిని ఏర్పాటు చేసినవారితో తనకు తీవ్రమైన భేదాభి ప్రాయాలు వున్నట్టుగా అతడు నా వైపు కొరకొర చూశాడు. నా మట్టుకు నాకు యిదొక పెక్యూలియర్ కేసులాగే తోచింది. కుర్రాడు నీటుగా ముస్తాబై ఉన్నాడు. కండగలిగిన నేలలో ఏపుగా పెరిగిన అరటిపిలకలా కలకల లాడుతున్నాడు. ముఖంలో అవిధేయత లేశమాత్రంగానైనా కాన రావడంలేదు. యాచకుడి పోరుపడ లేక కవచకుండలాలను తీసి యిచ్చేసిన కర్ణుడిలా అయ్యవారికి అవసరమైతే తాను వేసుకొన్న చొక్కాషరాయిలు గూడా తీసియిచ్చేసి, దిగంబరంగా యింటికి వెళ్లిపోయే బుద్ధిమంతుడిలా కనిపిస్తున్నాడు.

ఎందుకైనా నామంచిదని పిల్లలనందరినీ చింతచెట్టు క్రిందికి నడపించి దూరదూరంగా కూచోమన్నాను.

"బాబులూ! మీకు పరీక్షపెట్టాలన్నదికాదు నాఉద్దేశం. కానీ ఎందుకో మీ దస్తూరి ఎలావుంటుందో చూడాలని నాకు కోరికగా వుంది. ఎవరికితోచింది వాళ్ళురాయకుండా అందరూ ఒక్కటే వ్రాయడం బాగుటుంది. తెనుగు భాషలో అచ్చులనీ, హల్లులనీ కొన్ని వున్నాయి. అ, ఆలే అచ్చులు. క, ఖలే హల్లులు. ఏదీచూద్దాం. ప్రారంభించండి...."

కుర్రవాళ్ళు మొదట తెల్లబోయినట్టుగా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. "ఓస్, యింతేనా! ఇదెంత పని' అన్నట్టుగా కాగితం చేతికి తీసుకున్నారు. కొందరు తొందరగా వ్రాసుకపోతుంటే మరికొందరు నిలకడగానే అక్షరాలను రూపొందిస్తున్నారు. కానీ ఒక్కొక్క ప్రశ్నకూ ఒక్కొక్క కానుకను వాగ్దానంచేసిన విద్యార్థి చేతిలోని కాగితం మాత్రం ఆఖరువరకూ ఎడారిలా బోసిగావుండి పోయింది. ఆ ఎడారిలో దారిదప్పిన ఒంటెల్లా కాగితంపైన ఒకఏడెనిమిది అక్షరాలు మాత్రం దృగ్గోచరమౌతున్నాయి.

నేనాకుర్రాణ్ణి మందలించ దలచుకోలేదు. అందువల్లనాకుగానీ, అతడికిగానీ ఒరిగేదిలేదని నాకు తెలుసు. మెల్లగా వాకబుచేసి వివరాలుమాత్రం సేకరించాను. ఆ

కుర్రవాడి పేరు హరిబాబు. ఊరు చింతలపల్లి. ఆవూరిలోని ప్రాథమిక పాఠశాలలోనే అయిదేళ్ళపాటు చదువుకున్నాడు. విశేషమేమిటంటే అతడొక సంవత్సరమైనా ఫెయిలుకాలేదు.

రోగాన్ని గురించి తెలుసుకోడంకన్నా రోగకారణం గురించి తెలుసుకోడమంటేనే నా కెక్కువ మక్కువ, అందువల్ల నేనొక పనిచేశాను. ప్రతిరోజు సాయంకాలం కొంతదూరం షికారుగా వెళ్ళిరావడం నావాడుక. ఆ దూరాన్ని కొంచెం పొడిగించుకొని ఒకనాటి సాయంత్రం నేరుగా చింతపల్లికే వెళ్ళాను. అక్కడి ఉపాధ్యాయుడు నాకిదివరకు పరిచితుడే. బడి వెనుక నివాసయోగ్యంగా వుండడానికని నాలుగువైపులా గోడలుపెట్టి లోపలికి బయటికి రావడానికి వీలుగా ఒక ద్వారం గూడా అమరించిన ఒక పశువుల కొట్టంలాంటి పాకలోనే అతడి కాపురం. నేను వెళ్ళేసరికి అతడు యింటిముందరున్న గంగరావిచెట్టు క్రింద నులకమంచం వేసుకుని ఆ సాయంకాలంపూట గూడా నలుగురు కుర్రాళ్ళకు పాఠాలు బోధిస్తున్నాడు.

కుశల ప్రశ్నలయిన తరువాత నేను సూటిగా అసలు విషయంలోకి వచ్చేశాను.

"చూడండి రామానందంగారూ! ప్రతి విద్యాసంస్థ ఒక కర్మాగారంలాంటిది. ఇందులో ఉత్పత్తి అయిన సరుకు నాణ్యాన్నిబట్టి మాత్రమే బడికి పేరొస్తుంది. తిమ్మాపురం బడిలో నుంచి పైతరగతులకు వచ్చిన సరుకు వాసిలోనూ వన్నెలోనూ మేలైనదని యిదివరకు మాకు హైస్కూల్లో ఒక అభిప్రాయంవుంటూ వుండేది. మరైతే ఈ సంవత్సరం ఈ బడిలోనుంచి ఒక నాసిరకం నమూనా ఎలావెలువడగలిగిందో మాకు తెలియకుండా వుంది. విద్యార్థి తాను చదువు నేర్చుకునేది లేదని భీష్మించుకుని కూర్చున్నాడనుకోండి. ఉపాధ్యాయుడుగుడా తాను చదువు చెప్పబోవడంలేదని పంతం పట్టాడనుకోండి. కాని విద్యార్థి బడికి వస్తూవెళ్తున్నట్టయితే సహవాస దోషం వల్లనయినా కొంతచదువు అబ్బితీరుతుంది. ప్రపంచంలో వుంటూ, ప్రాపంచిక వాసనలకు అతీతంగా బ్రతకగలిగే యోగిసత్తముడిలా అయిదేళ్ళపాటు బడికివచ్చిగూడా ఒకవిద్యార్థి విద్యాగంధం ఒంట బట్టించుకోకుండా ఎలా వుండిపోగలిగాడో నాకు తెలియడం లేదు. ఈవిడ్డూరానికి కారణమేమిటో తెలుసుకోదలిచిన నా కుతూహలాన్ని మీరు మన్నించాలి. నదుల జన్మస్థానాన్ని తెలుసుకోడానికి, పెద్దశిఖరాల పైన కాలుమోపడానికి సాహసికులు కొందరు ఎంతోవ్యయప్రయసలకోర్చి ప్రయాణాలు సల్పిన ఉదంతాలు మీరు వినేవుంటారు. వాళ్ళతో పోల్చిచూస్తే నాశ్రమ ఒకలెక్కలోనిదిగాదు...." అర్థంకానట్టుగా కొద్దిక్షణాల వరకు నావైపు వెర్రిచూపులు చూస్తూ కూర్చున్న రామానందం హఠాత్తుగా విషయం స్ఫురించినట్టు టపీమని నోరు తెరిచేశాడు.

"ఏమండీ మీరు హరిబాబనే కుఱ్ఱవాణ్ణి గురించేనా చెబుతున్నది? నాకు తెలుసు. నేను మొదటినుంచే అనుకున్నాను. వీడివల్ల హైస్కూల్లో నాకేదో గొడవొస్తుందని! అనుకున్నంత పని జరిగింది. అలాగైతే మీరిందుకైనా రావడం! మంచిదే మీరు రావడమే మంచిదయింది ఎందుకంటారా? పరిస్థితి విడమరిచి చెప్పడానికైనా ఒక అవకాశం దొరకాలిగదా! తిమ్మాపురం సుబ్బారాయుడుగారన్న పేరు ఎప్పుడైనా విన్నారా మీరు? వినే వుంటారు. అదిగో, వూరిమధ్య మేడ కన్పిస్తోంది చూచారా, అదే సుబ్బారాయుడుగారి భవంతి. ఇప్పుడైతే ట్రాక్టరొచ్చి మడకలు మూలబడ్డాయి గానీ మునుపాయనిది పదిమడకల సేద్యం...."

సుబ్బారాయుడుగారి భారీ సేద్యానికి, హరిబాబు చదువుకూ వున్న సంబంధ మేమిటో నాకు బోధపడడం లేదు.

"సదరు సుబ్బారాయుడుగారికి అయిదుగురు కూతుళ్ళూ, ముగ్గురు కొడుకులు. పెద్దకొడుక్కు బిడ్డలు లేరు రెండో కొడుక్కు అందరూ ఆడబిడ్డలే. మూడో కుమారుడి ఏకైక సంతానం ఈ హరిబాబొక్కడే...."

"వంశ వృక్షం అమూలాగ్రంగా విశదమైంది" అన్నాను.

అందువల్ల ముగ్గురు తండ్రులకు ముగ్గురు తల్లులకు వీడొక్కడే మగబిడ్డ. పులిమీద పుట్రలా యింకొకటి జరిగింది. వీడు పుట్టిన సంవత్సరం చెరకు బెల్లం బారువ ఒకటికి నాలుగొందల రూపాయల ధరపలికి, సుబ్బారాయుడిగారికి అందుమూలంగా నలభైవేల రూపాయల ఆదాయం వచ్చిపడింది. వస్తూ వస్తూ ధనలక్ష్మిని వెంటబెట్టుకుని వచ్చినవాడు గావడంవల్ల ఈకుఱ్ఱాడంటే ముసలాయనకు చెప్పరానంత మమకారం. మనవడిపైన ఈగ వాలడానికైనా ఆ తాతగారొప్పుకోరు...."

"ఈగ వాలడాకనికొప్పుకోడు సరే! చదువుకోడానికి గూడా ఒప్పుకోడా?..." అని ప్రశ్నించాను.

అబ్బే చదువేం చదువండి? ఆ చదువు గనుక వీశలలెక్కన దొరికేటట్టయితే మనవడి కోసం ఒకవాగను చదువు కొని స్టాకుపెట్టేవాడే సుబ్బారాయుడుగారు. దాని సిగతరగా, అదలా దొరికిచావడం లేదు. ఎంతటి వాడైనా బడికి వెళ్ళవలసిందే! సుబ్బారాయుడిగారికి తలమాసినవాణ్ణి నేనొక్కణ్ణిదొరికాను. నేనిక్కడ గవర్మెంటు వారు పెట్టించిన బడిలోనే పనిచేస్తున్నాననుకోండి! కానీ సుబ్బారాయుడి గారి అనుగ్రహం లేకపోతే ఒక్కక్షణం యిక్కడ వుండలేను! పోగా నేను ఆరుగురు బిడ్డల తండ్రిని. ఏంచేయమంటారు బాబూ! నా కక్కుర్తి నాకుండడంలో నన్ను మీరు తప్పుపట్టరనే భావిస్తాను. మనం ఎంత వద్దనుకున్నా లోకంలో కొన్ని నామర్దా పన్లు జరిగిపోతుంటాయి. డబ్బు పెట్టిచదువును కొనుక్కునే

వెసులుబాటు లేకపోవచ్చు. కానీ చదువుకున్నట్టు దాఖలాగా సర్టిఫికెట్లు సంపాదించడం మాత్రం సాధ్యమేనని సుబ్బారాయుడుగారు తలపోస్తున్నారు....."

నేను నవ్వాను.... "ఎలిమెంటరీ స్కూల్లో మీలాంటి వెర్రిబాగుల పెద్ద మనిషి వుండి పోవడంలో ఆయన ఆడింది ఆటగా, పాడింది పాటగా చలామణీ అయింది. హైస్కూల్లో ఆ పప్పులుడకవు ఏలాగంటారా....."

వాక్యం పూర్తిగాలేదు. ఒక నల్లటి మనిషి, నడిప్రాయంవాడు మా ఎదుట ప్రత్యక్షం అయ్యాడు. "అయ్యా పంతులుగోరూ! ఎవరో అయిస్కూలు అయ్యోరంట గదండీ! మీ కాడికొచ్చి వున్నాడని తెలిసి, పెదబాబుగోరు పిల్చుక రమ్మన్నారు" అన్నాడు.

రామానందం చూపుల్లో ఆశ్చర్యం పుట్టిపడుతోంది. "చూచారా! ఈ వూళ్ళో చీమచిటుక్కుమన్నా సుబ్బారాయుడి గారికి తెలిసిపోతుంది సుమండీ!" అప్పటికదొక హాస్యంలాగా నా చెవిలో వూదాడు రామానందం.

"ఫరవాలేదులెండి! నన్ను నేను కాచుకోగలను" అంటూ ఆ మనిషిని వెంబడించాను.

సుబ్బారాయుడిగారి యిల్లు, ఆకారం, హోదా అన్నీ ఎలావుండాలో అలాగేవున్నాయి. కానీ అంతటి గొప్పవాడు నన్నుగొప్పజేసి గౌరవించడ మొక్కటే నాకు విడ్డూరంగా తోచింది. ఏమిటో అనుకున్నానుగానీ నాకక్కడ రాజోపచారాలు జరిగాయి. పాలు, పళ్ళు, బిస్కట్లు, పిండివంటలు తినలేక మిగిలించేశాను. చిక్కటిపాలు ఒక గ్లాసు మాత్రం త్రాగి రెండోది తీసుకరావద్దని బ్రతిమాలుకున్నాను. రాత్రి కుండి తెల్లవారి ఉపాహారం సేవించి వెళ్ళగూడదా అని యిక లేనట్టు చెప్పి చూచారు సుబ్బారాయుడుగారు. "అబ్బే, ఎందుకులెండి మళ్ళీ ఎప్పుడైనా వస్తాను" అంటూ తప్పించుకున్నాను. "పంతులుగారూ! మీరేమో మొగమాటస్తులట! నాకు చెప్పారులెండి! అలాంటిదేం పెట్టుకోవద్దు. ఇదిమీస్వంత యిల్లుగా భావించండి. మా అబ్బాయిని మీరుకాస్తకనిపెట్టుకొని వుంటేచాలు. మిగిలిన విషయాలు మాకు వదిలి పెట్టండి" అంటూ తాకీ తాకకుండా మచ్చు మందుచల్లడం ప్రారంభించేసరికి నా జాగ్రత్తలోకి నేను వచ్చేశాను. ఐనా వాళ్ళ కుర్రాణ్ణి కనిపెట్టుకొని ఉంటానని గాని, వుండననిగానీ, నేను చెప్పలేదు. ఘనంగా మర్యాద చేసి నందుకు ప్రతిఫలంగా పాపం ఆ ముసలాయనలో కొంత ఆశాభావం మిగిలించడమే నాకున్యాయంగా తోచింది. వారం పది రోజుల్లో నే నెలాగూ బదిలీఅయి వెళ్ళిపోతున్నాను. ట్రాన్స్ఫరు రావడం ఖాయమని లాబీవర్గాల ద్వారా ఒకటి రెండు రోజులక్రితమే తెలిసింది. పాపం, సుబ్బారాయుడిగారి పట్ల నా సానుభూతి, మనవడి చదువు కోసం నాలాంటివాణ్ణి నమ్ముకున్నందుకు!

చివర కొద్ది మాటలు చెప్పాలి....

నేను చింతపల్లికి వెళ్లివచ్చి నెల రోజులయింది. ఇంతవరకూ నాకు బదిలీ రాలేదు. నా విషయంలో బదిలీ రావడం ఎంత సహజమో, రాకపోవడం అంత అసహజం! పనిమీద టౌనుకువెళ్లి, ఆఫీసులో విచారించగా క్లర్కు తెల్లబోయాడు. 'అబ్బో, గడసుపిండమేనే" అన్నట్టు తల పంకిస్తూ "భారీసైజు పేపరు వెయిటు తీసుకొచ్చి పెట్టేశారు గదండీ! మామూలు కాగితమా ఏ చిన్నగాలి వచ్చినా కొట్టుకపోవడానకి! తిమ్మాపురం సుబ్బారాయుడుగారంతటివారు స్వయంగా చెబుతుంటే యిక మీకు ట్రాన్స్ఫరెక్కడిదండీ, అంతా మీభ్రమ గానీ!" అన్నాడు. ముఖంలో నెత్తురు చుక్కలేక నేను తిరిగి వచ్చేశాను. ఆ రోజు మధ్యాహ్నం బడి వదలగానే నేను యింటికి వెళ్లేసరికి మా ఆవిడ దివ్యంగా వంటచేసిపెట్టి నాకోసము ఎదురు తెన్నులు చూస్తోంది. ఉదయం ఉపాహారంగూడా తిన్నానుకానేమో, ఆకలిగా ఉంది. వెనుకా ముందూ చూడకుండా తినిలేచాను. తాంబూలం తీసుకొచ్చి సరసన కూచుంటూ "ఏనాడూ లేనిది ఈ రోజెంతమంచిపని చేశారండీ?" అంటూ మొదలెట్టింది మా ఆవిడ. "కడుపునిండా తినడమేనా" అన్నాను, "అబ్బే అదికాదండీ! తినడానికేముంది? ఎవరయినా తినొచ్చు. అందుకు కావలిసినవి తీసుకొచ్చి పడేయడమే కష్టం. ఒక్కసారిగా మూటెడు బియ్యం కొనెయ్యడమే మంచిదిబాబూ కలిసివస్తుందని ఎప్పటినుంచో చెబుతున్నాను. ఈ నాటికి మీకే తెలిసొచ్చింది," అంటూ వివరించింది. "ఒక మూటెడు బియ్యమా? నేను కొన్నానా?" అంటూనే బిక్కమొహం పెట్టేసరికి "తిమ్మాపురం సుబ్బారాయుడుగారటండీ! ఆయన పంపించాడని ఒక మనిషి తీసుకొచ్చి మూట నింటిలో దింపి పోయాడు," అంటూ అసలు విషయం బయట పెట్టింది.

కోపంతో ముఖం జేవురించిందనీ, నా శరీరంలోని ప్రత్యణువూ దహించుక పోతోందనీ వేరే చెప్పనక్కర లేదు. "వసంతా!" అంటూ బిగ్గరగా ఓ గావుకేక పెట్టాను. "ఆ మూటలో ఒక బియ్యపుగింజ నాకు తాకడానికి వీల్లేదు. అలాగే తిప్పి పంపించి వేయాలి."

"ఇదేం ఎవ్వారమమ్మో! ఉత్తపుణ్యానికి అంతకోపమెందుకండీ మీకు? బియ్యం పంపమని మీరే చెప్పివుంటారు. వాళ్లు తెచ్చిపడేయడంగూడా తప్పేనా ఇప్పటికే ఒకపూట గోధుమలు తింటున్నామాయె! ఇక మీదట ముచ్చటగా మూడుపూటలా ఆ గోధుమ రొట్టెలే తినాలంటారా ఏమిటి ఖర్మ! ఏమిటో బాబూ, మీ వాలకం నా కర్థంకాదు. నేనేమో వాళ్ళకూ వీళ్లకూ బదుళ్లు ఇవ్వవలసివుంది. అందులోనుంచీ పదిపళ్లు కొలిచేశాను. అంతెందుకూ, మీరిప్పుడు తినిందిగూడా ఆ బియ్యమేనే!"

హరోంహరా! లాభంలేదు. ఎంత జాగ్రత్తగా వున్నా అంటురోగం నన్ను దయదల్చలేదు. (...తరుణ ప్రారంభ సంచిక)

❀ ❀ ❀